# ఈ పిల్లులు పాలుతాగవు !

డబ్బా—

కాదు కాదు. డబ్బాలు-

అవును. ఈ కథను డబ్బాలతోనే మొదలు పెడతాను.

వరసగా డబ్బాలు. చిన్నా పెద్దా డబ్బాలు.

ఆ డబ్బాలతోబాటు మనుషులు. పొడుగూ పొట్టీ రకరకాల మనుషులు.

ఆ డబ్బాలన్నీ కిరసనాయిలుకోసం.

ఆ మనుషులందరూ కిరసనాయిలు నింపిన డబ్బాలకోసం.

ఆ డబ్బాల క్యూకి ఇరవై గజాల్లో నిలబడ్డాను నేను - మరొక క్యూలో. మా క్యూ బస్సుకోసం.

కిరసనాయిలు క్యూలో నించోటానికి మాకు టైము లేక ఖాళీగా వున్న మా బామ్మరుదులనీ, తమ్ముళ్ళనీ, పిల్లలనీ పంపి, మేమీ క్యూలో నించున్నాం.

బస్సొచ్చింది - బస్సులాగ.

ఎక్కాం - జనంలాగ.

తేడీ గుర్తులేదు-

ఆ రోజునించే సిటీబస్సు రేట్లు కూడ పెరిగిపోయాయి. పొద్దున్న పేపర్లో వచ్చినట్టుంది. కానీ పేపరు చూసే అలవాటు మాకు తప్పిపోయి చాలా రోజులైంది. ఎందుకంటే పక్కింళ్ళవాళ్ళు కూడ పేపరు తెప్పించటం మాని చాలా రోజులైంది. పేపరు చూడాలంటే ఎక్కడికో పోవాలి.

మా ఆఫీసర్లే లైబ్రరీ పేపరు వంతులవారీగా చదువుకుంటారు. చేసేది ఎంత సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగమైతేమాత్రం, వెలిగిస్తున్నది గుమాస్తాగిరీయేగా! నేను పేపరు తెప్పించటం మానుకుని ఏడాదైంది.

కండక్టరు నాదగ్గిర కొచ్చినపుడు, కండక్టరుకి మాత్రం వినబడేలా నేను దిగవలసిన స్టేజి పేరు చెప్పాను.

"పైంతాలీస్ దేవ్!" అన్నాడు కండక్టరు.

మాట్లాడకుండా నలభై అయిదు పైసలూ ఇచ్చి కండక్టరిచ్చిన టిక్కట్టు తీసుకున్నాను.

బస్సులో అప్పుడే రొద ప్రారంభమైంది.

'పేపర్లో వెయ్యలేదేం?' అనేవారొకరు.

'వేశార్లేనయ్యా ఓమూల. అయినా ఇంత దారుణంగా పెంచేయడమే!' అని ఆశ్చర్యపోయేవారు మరొకరు.

'మనం సరే అనుకోండి. కొంతమంది పాపం! సరిగ్గా ఆ రోజుకి సరిపోయే డబ్బులే తెచ్చుకునేవారున్నారు. వాళ్ళ గతేంకాను?" తనే అలా వస్తానని చెప్పటానికి మధ్యతరగతి మిధ్యాగౌరవం అడ్డొచ్చిన పెద్ద మనిషి.

'ఈ వేళకి ఏదో అవస్థపడతారులెండి. కానీ ఇది ఈ వేళతో తీరిపోయేది కాదుగదా!' పరిస్థితుల నెరుగ్గోలేక ముదిరిన వేదాంతం.

'బస్సుపాసున్నవాళ్ళకే నయమండి. పదిరూపాయల్లోటి వదిలి పోతుంది.' బస్సుపాసులేని వెంకట్రావు బస్సుపాసుగల సుబ్బారావుపై చూపే అసూయ.

'అదీ పెంచేత్తారండి. ఊరుకుంటాడేటి?' మరో అప్పల్రాజు ఊరడింపు.

జగన్నాధం, కూర్మనాధం, గుర్నాధం, రామనాధం ఎక్కడున్నారో నేను వెతుక్కో అక్కర్లేదు మా బస్సులో.

వాళ్ళందరూ నాకన్నా పెద్దవాళ్ళే. ముప్ఫయి అయిదుకీ నలభైకీ మధ్య వయస్సున్నవాళ్ళే. పెళ్ళయి కాపురాలు చేసుకుంటున్నవాళ్ళే.

అయినా—

వాళ్ళు నలుగురూ లేడీస్ సీటు వెనక సీటు, ఆ వెనక సీటుకి వెనక సీటులోనే కూర్చుంటారు - సాధారణంగా.

అందరికన్నా క్యూలోకి ముందురావటంతో వాళ్ళకది సాధ్యమే. ఆ సీటుల్లో కూచుని, అక్కణ్ణించి వెరికామెంట్సు, చచ్చుజోకులు, పిచ్చినవ్వులూ.

అయితే—

ఒకరోజు జగన్నాధం, గుర్నాధం లేడీస్ సీటు వెనక సీట్లో కూచుంటే, ఆ మర్నాడు కూర్మనాధం, రామనాధం ఆ సీటులో కూచుంటారు. అలా ఆ సీటుని షేర్ చేసుకుంటారన్నమాట.

గుర్నాధం ఓ పెద్ద బ్యాంకులో చిన్న గుమాస్తా. కానీ ఆ బ్యాంకులోవున్న ఒక యూనియన్‌కతను జాయింటు సెక్రటరీయో ఏదో.

జగన్నాధానికీ, రామనాధానికీ సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగాలే.

పోతే—

కూర్మనాథం స్టేట్ గవర్నమెంటు ఉద్యోగేకాని, అతను వాళ్ళ ఉద్యోగుల సంస్థలో ఎగ్జిక్యూటివ్ మెంబరు.

'ఆడవాళ్ళకి ఆఫీసు వర్క్‌లోనూ, పెర్మిషన్స్‌లోనూ, కన్‌సెషన్ కదా, మీ బస్సురేట్లలోకూడా ఏమైనా ఇచ్చారా?' జగన్నాధం వెకిలితనం.

"బస్సురేట్లు ఇన్ని తఫాలు పెంచేసి కూడ - తస్సాదియ్యా, లాసో లాసో అని ఏడుత్తారేటయ్యా మీరు?" కూర్మనాధం అతి తెలివితనం.

'ఎవుడయ్యా, సెప్పకుండా రేట్లు పెంచమన్నది?' రామనాధం రీజనింగు.

'క్యాయి సాబ్! నోటిఫికేషన్ నై కుచ్ నై : తమాషా కర్‌రైకా తుమారే జియమ్మ సాబ్!!' గుర్నాధం దాదాగిరి.

ఒంటరిగా కృష్ణుడు రాయబారానికి వెళ్ళినపుడు "చూడు. నిన్నేం చేస్తామో!' అని చుట్టూ మూగిన కౌరవులను చూసి నవ్వినట్టుగా నవ్వాడు కండక్టరు. కృష్ణుడికి నెత్తిమీద నెమలిఫించముంటే కండక్టరుకి చెవిలో పెన్సిలుంది.

కాసేపొయ్యాక—

నేను, గుర్నాధం, రామనాధం దిగుతుంటే-

'ఉండండి. మేమూ దిగుతాం!' అంటూ కూర్మనాధం, జగన్నాధం కూడ దిగిపోయారు.

వాళ్ళు మొదట ఏం మాట్లాడుతారో నాకు తెలుసు.

'దారుణంబై' అన్నాడు గు. నాధం.

'మహోదారుణం!' అన్నాడు జ. నాథం.

'కాదూ మరీ!' వంత పలికారు కూ. రా. నాథాలు.

"ఇద్గో నువ్వేమీ మాటాడవేఁయ్యా సలితేలులాగ!" అడిగాడు రామనాథం.

"మీరు మాట్లాడుతున్నారుగా!" అంటూ నవ్వేశాను నేను.

'మనం ఊరుకుంటే లాభం లేదు. త్వరగా ఏదో ఒకటి చేయాలి!' అన్నాడు జగన్నాధం.

'మా అసోసియేషన్లో - గట్టిగా ఇది కదిపానంటే - తప్పొదియ్యా, మూడు రోజుల్లో రేట్లు తగ్గించెయ్యరూ!' కూర్మనాధం.

"ఇద్గో ఎవడయ్యా - నువ్వా ఆ పని చేసేది?" రామనాధం.

"నేను చెప్పినానంటే - ఇన్నావా, మా బేంకోల్లంతా బస్సెక్కడమే మానేత్తరు" గుర్నాధం.

కూర్మనాధం, రామనాధం, గుర్నాధం, జగన్నాధం మాట్లాడారు. ఆ తర్వాత గుర్నాధం, జగన్నాధం, కూర్మనాధం, రామనాధం మాట్లాడారు. ఆపైన రామనాధం, గుర్నాధం, జగన్నాధం, కూర్మనాధం మాట్లాడారు.

-అలా తక్కువ వ్యవధిలో ఎక్కువసార్లు మాట్లాడాక, వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు ఇవి :-

1. ముందుగా వాళ్ళవాళ్ళ యూనియన్స్‌తో చెప్పి బస్సురేట్లు తగ్గించవలసిందిగా మెమోరాండమ్స్ ఈయటం.

2. తక్కువదూరం - అంటే రెండుమూడు స్టేజీలు మాత్రమే వెళ్ళవలసిన పాసెంజర్స్‌ని నడిచిపొమ్మని ఉద్బోధించటం.

3. స్టూడెంట్సుని (వాళ్ళ బస్సుపాసులు పెంచకపోయినాసరే) రెచ్చగొట్టి, తమలో కలుపుకోవటం.

4. అంతగా లొంగకపోతే, శాంతియుతంగానే బస్సులను బాయి కాట్ చేయటం.

ఎవరి ఆఫీసులకు వారు పోయేముందు– 'నీ అభిప్రాయం ఏమిటి?' అని అడిగాడు నన్ను. 'న్యాయసమ్మతంగాచేసే ఏపనికైనాసరే, నేను రెడీయే!' అన్నాను నేను, నా ఉద్యోగాన్ని గుర్తుచేసుకుంటూ.

* * *

ఇది జరిగిన పదిరోజులు మా బస్సులోనే వచ్చారు– రామనాథం, కూర్మనాథం, జగన్నాథం, గుర్నాథం. బస్సురేట్ల గురించి చేతనైనన్ని కామెంట్లు చేశారు. "చూడండి. ఏంచేస్తామో!' అన్నారు.

కానీ తక్కువదూరం ప్రయాణించే ప్రయాణీకులను కన్విన్స్ చేయటం, స్టూడెంట్స్‌తో మాట్లాడటం, బస్సులను శాంతియుతంగా బాయికాట్ చేయాలనటం – నేను చూడలేదు, వినలేదు.

కనీసం విద్యార్థులు "బస్సుల బాయికాట్" నిర్వహించిన రోజున కూడ వీళ్ళు నలుగురూ ఆఫీసులకి (బస్సులో) పోవటం మానలేదు.

పదిహేనురోజులయ్యాక –

ఆరాతీస్తే తెలిసిందేమిటంటే నలుగురు 'నాథాలు' మా బస్సులో రావటం మాత్రమే మానేశారు కానీ మొత్తానికి బస్సుల్లో రావటమే మానెయ్యలేదూ– అని.

గుర్నాథం మా బస్సుకన్నా ముందు బైల్దేరే బస్సులో వెళ్ళిపో తున్నాడు.

రామనాధం, జగన్నాధం మాకు కొంచెం దూరంలోవున్న కాలనీకి షార్ట్‌కట్‌లో వెళ్ళి అక్కడ బస్సెక్కుతున్నారు. (ఇక్కణ్ణించి వాళ్ళాఫీసుకి నలభై పైసలైతే, అక్కణ్ణించి ముప్పయిపైసలేట.)

పోతే కూర్మనాధం-

బస్సుపాసు పెంచకపోవటంతో అది తీసేసుకున్నాడు. పైగా వాళ్ళు నలుగురూ అలా వెళ్ళే సంగతి మాకెవరికీ తెలియదనుకుంటున్నారు.

పిల్లి కళ్ళుమూసుకుని పాలు తాగుతూ-

ప్చ్. ఎందుకులెండి! వీళ్ళు పాలు తాగరు.